క్లుప్తంగా

ఈరన్నస్వామికి విశేష పూజలు


స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో సుందరంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తుల తాకిడితో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. పలువురు భక్తులు ఆలయ ఆవరణలో పిండి వంటలు చేసి స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రయాణికుల దాహార్తిని తీరుస్తాం


నీటిని ప్రయాణికులకు అందిస్తున్న డీఎం రఫిక్

ఆదోనిటౌన్‌: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల దాహార్తిని తీరుస్తామని డీఎం రఫిక్ తెలిపారు. సోమవారం బస్టాండ్‌లో ఎస్‌టీఐ రాఘవేంద్రప్రసాద్‌తో కలిసి చలివేంద్రం ప్రారంభించారు. శ్రీసాయి ఆదోని ఫేర్ ఎగ్జిబిషన్ ఆధ్వర్యంలో అల్లాబకాష్ సౌజన్యంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని డీఎం చెప్పారు.

విద్యాభివృద్ధికి కృషి


నూతన కమిటీ సభ్యులు

కౌతాళం: ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నటరాజ్, కార్యదర్శి నాగరాజ్ అన్నారు. మంత్రాలయం నియోజకవర్గ ప్రైవేట్ పాఠశాలల జనరల్ బాడీ సమావేశం సోమవారం కౌతాళంలో ప్రతిభ హైస్కూల్‌లో నిర్వహించారు. అనంతరం నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మంత్రాలయం చంద్రశేఖర్‌రావు, అధ్యక్షుడిగా దూద్‌బాషా (కౌతాళం), కార్యదర్శిగా శేఖ ర్ (పెద్దకడుబూరు),కోశాధికారిగా లక్ష్మన్న (కోసిగి), సభ్యులుగా కృష్ణమూర్తి, విశ్వనాథ్‌రెడ్డి, రాజశేఖర్, నాగర్జునరెడ్డిలను ఎన్నుకున్నారు.

కేంద్ర బలగాల కవాతు


రౌడూరులో కావతు చేస్తున్న కేంద్ర బలగాలు

కౌతాళం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం కలగకుండా ఉండేందుకు ముందస్తుగా సోమవారం కౌతాళంతో పాటు ఫ్యాక్షన్ గ్రామాలైన నదిచాగి, రౌడూరు గ్రామాల్లో కేంద్ర బలగాలతో కలిసి కోసిగి సీఐ ప్రసాద్, కౌతాళం ఎస్ఐ నరేంద్ర కుమార్, పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా కోసిగి సీఐ ప్రసాద్ మాట్లాడుతూ.. ఎన్నికల వేళ శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంత ఎన్నికలకు అందరూ సహకరించాలని కోరారు. స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.

రేపు హుండీ కానుకల లెక్కింపు

కౌతాళం: మండలంలోని ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో బుధవారం హుండీ కానుకలను లెక్కించనున్నట్లు ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్, డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. లెక్కింపులో పాల్గొనే వారు పంచ, ఉత్తరీయం (టవల్) తప్పక ధరించాలని సూచించారు.

29 నుంచి ఆరాధనోత్సవాలు

మంత్రాలయం: శ్రీరాఘవేంద్రస్వామి పూర్వపు పీఠాధిపతి, ప్రస్తుత పీఠాధిపతి గురువు సుయతీంద్రతీర్థులు ఆరాధనోత్సవాలు ఈ నెల 29వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. మంత్రాలయం నవ నిర్మాణ శిల్పిగా సుయతీంద్రతీర్థులు ప్రసిద్ధి. స్వామిజీ కాలంలోనే మంత్రాలయం గర్భాలయం శిలామండపం నిర్మాణం జరిగింది. 2009 వరదల తర్వాత క్షేత్రం రూపురేఖలకు మెరుగులుదిద్దారు. 29న పూర్వారాధనలో భాగంగా వేదిక ప్రారంభం, విధూషి రూపశ్రీ ప్రభంజనతో దాసవాణి, 30న మధ్యారాధన సందర్భంగా స్వామిజీ మూలబృందావనానికి పంచామృతాభిషేకం, ఉదయం బంగారు రథోత్సవం నిర్వహించనున్నారు. 31వ తేదీ ఉత్తరారాధనలో భాగంగా విద్వాన్ శ్రీనిధిఆచార్‌తో దాసవాణి, పండితుల ప్రవచాలు ఉంటాయని శ్రీమఠం మేనేజర్ శ్రీనివాసరావు వెల్లడించారు.

అన్నదాతలకు తప్పిన అవస్థలు

➤**నాడు..**విత్తనాలు, ఎరువులు లభిస్తే చాలు.. పంట దిగుబడి వచ్చిననాటి కన్నా అధికంగా సంబరపడేవారు రైతులు. ఇక మట్టి నమూనాలు అంటే ఏంటో కూడా వారికి తెలియదు. నకిలీ విత్తనాలు.. కల్తీ ఎరువులు, మందులను తట్టుకొని దిగుబడి చేతికొస్తే దళారుల దోపిడీతో నష్టాలే మిగిలేవి. పంట నష్టపోతే పరిహారం మాట దేవుడెరుగు.

➤**నేడు..** గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను నిర్మించి వేసవిలోనే భూసార పరీక్షలు నిర్వహిస్తారు.. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు లభిస్తాయి.. కల్తీతో అన్నదాతలు నష్టపోకుండా ఆయా కేంద్రాల్లో విత్తన జర్మింగ్ ప్రక్రియ అందుబాటులో ఉండటం, పంటల సాగులో కర్షకుడికి నిత్యం సలహాలు సూచనలిచ్చేందుకు సిబ్బంది ఉండటం.. దిగుబడిని ప్రభుత్వం నిర్ణయించిన ధర మేరకు ఆర్బీకే పరిధిలోనే కొనుగోలు చేయడం..ఏదేని ప్రకృతి వైపరీత్యం, తెగుళ్లతో పంట నష్టపోతే ఏ సీజన్‌కు సంబంధించిన పరిహారం ఆ సీజన్‌లోనే అందజేసేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

- గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు
- భూసార పరీక్షల నుంచి దిగుబడుల కొనుగోలు కూడా అక్కడే
- అన్ని రకాల సేవలు అందుబాటులో
- పంటల సాగులో వ్యవసాయ శాఖ సిబ్బంది సలహాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



పెసలబండ గ్రామంలో ప్రారంభమైన రైతు భరోసా కేంద్రం


నాగనాథనహళ్లిలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)

ఆదోని రూరల్: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు వ్యవసాయం భారంగా మారకూడదని, లాభదాయకంగా మారేలా చర్యలు చేపట్టింది. ఇందుకు గ్రామస్థాయిలో వ్యవసాయ సేవలన్నీ అందుబాటులో ఉండేలా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి అవసరమైన సిబ్బందిని నియమించారు. వాటిల్లో ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, భూసార పరీక్షలు, విత్తనాల జర్మింగ్ నాణ్యత తెలుసుకునే పరీక్షలు, పంట సాగుకు అవసరమైన సలహాలు, మార్కెట్‌లో ఎంలాంటి పంట దిగుబడులకు మంచి ధర లభిస్తుందనే సమాచారం తెలుసుకోవడానికి, పంటల సాగులో సాంకేతిక వినియోగం కోసం లైబ్రరీ కూడా అందుబాటులో ఉంచింది. ఇలా అన్నదాతను పొలాలను సిద్ధం చేసేటప్పటి నుంచి దిగుబడి విక్రయించే వరకు వారికి అడుగడునా అండగా నిలుస్తోంది. ఆదోని మండలంలో 41 గ్రామ పంచాయతీలుండగా 37 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇటీవల పంట దిగుబడులను మంచి ధర లభించేంత వరకు భద్రపరుచుకునేందుకు గోదాములను నిర్మిస్తోంది. కొన్ని చోట్ల నిర్మాణాలు పూర్తవగా,మరోకొన్ని చోట్ల పనులు జోరుగా సాగుతున్నాయి. మండలంలో మొత్తం రైతులు 25,363 మంది ఉండగా సాగు విస్తీర్ణం 89,557 హెక్టార్లు ఉంది.

ఆర్బీకేలతో ప్రయోజనం..

రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులకు, ప్రభుత్వ సమాచారం, ఆన్‌లైన్‌లో పంటల నమోదు, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ ధరలు, ఆధునిక సాంకేతిక సలహాలు, వాతావరణ సమాచారం, కౌలు కార్డులు పొందవచ్చు. అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసుకోవచ్చు. అంతేగాకుండా బ్యాంకు లావాదేవీలు చూసుకునే అవకాశం కూడా ఉంది. సబ్సిడీ యంత్రాలు, ఇతర వ్యవసాయ పరికరాలను లబ్ధి పొందుతున్నారు. ఎప్పటికప్పుడు పంట మద్దతు ధర తెలుసుకోవచ్చు. కేంద్రాల్లో ఏర్పాటు చేసిన టీవీల్లో రైతులకు ఉపయోగపడే సలహాలు, పంట సాగు మెళకువలను చూడవచ్చు. జిల్లా వ్యవసాయ అధికారుల సందేశాలను లైవ్‌లో చూడవచ్చు. మద్దతు ధర, ఆన్‌లైన్ మార్కెట్ ధరలను తెలుసుకోవచ్చు.

రైతులకు ఎంతో మేలు



నాకు ఐదు ఎకరాల పొలం ఉంది. గతంలో సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల కోసం 20 కి.మీ. దూరంలో ఉన్న ఆదోనికి వెళ్లి తెచ్చుకునేవాళ్లం. ప్రస్తుతం మా గ్రామంలోనే రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేశారు. అక్కడే అన్ని సేవలు అందుతున్నాయి. గత మూడేళ్లుగా నాకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అక్కడే తీసుకుంటున్నా. ఈ కేంద్రాల ద్వారా రైతులకు ఎంతో మేలు చేకూరింది.

– డి.బసిరెడ్డి, రైతు, పెద్దతుంబళం

వ్యయప్రయాసలు తప్పాయి



గతంలో సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు తీసుకునేందుకు ఎంతో ఇబ్బంది పడ్డాం. ఆదోని నుంచి మా గ్రామానికి సబ్సిడీ విత్తనాలు, ఎరువులు తెచ్చుకునేందుకు వ్యయ ప్రయాసాలు పడేవాళ్లం. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. రెండేళ్లుగా రైతు భరోసా కేంద్రంలోనే సబ్సిడీ వేరుశనగ, పత్తి విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను తీసుకుంటున్నాం. దీంతో వ్యయ ప్రయాసాలు తప్పాయి.

– బి.సి.విరుపాక్షి, రైతు, గణేకల్

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

ఆదోని మండలంలోని 41 గ్రామ పంచాయతీలకు గానూ 37 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి వ్యవసాయ సిబ్బందిని నియమించాం. వారు ఎప్పటికప్పుడు రైతులకు అందుబాటులో ఉంటూ పంటల సాగు, సస్యరక్షణ చర్యలపై వివరిస్తారు. అలాగే రైతులు పండించిన పంట దిగుబడులను రైతు భరోసా కేంద్రాల్లోనే కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పంట నష్టపరిహారం, సబ్సిడీ ఎరువులు, విత్తనాలు, యంత్రాలు అన్ని కేంద్రంలోనే లభిస్తాయి. యంత్ర పరికరాలు కావాల్సిన రైతులు దరఖాస్తులు చేసుకుంటే అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

– అశోక్‌కుమార్‌రెడ్డి, ఆదోని మండల వ్యవసాయ అధికారి

ప్రశాంత ఎన్నికలకు పటిష్ట చర్యలు

- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు
- 408 మంది బైండోవర్, 90 మందిపై రౌడీషీట్
- 52 లైసెన్స్‌ తుపాకుల స్వాధీనం
- 16 సమస్యాత్మక ప్రాంతాలు గుర్తింపు
- ఈనెల 31 వరకు కేంద్ర బలగాలతో కవాతు
- డీఎస్పీ శివనారాయణ స్వామి



ఆదోని అర్బన్: ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది. ఈ మహాక్రతువులో ఆది నుంచి తుది వరకు శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ పాత్ర ఎంతో కీలకం. ఎన్నికల ప్రవర్తన నియమావళి తూ.చ. తప్పకుండా అమలయ్యేలా చూడడంతో పాటు పరిస్థితి అదుపు తప్పితే నియంత్రించాల్సిన విధి కూడా ఈ శాఖదే. ఈ నేపథ్యంలో ఆదోని నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణకు పోలీసుశాఖ సన్నద్ధతపై డీఎస్పీ శివ నారాయణస్వామి వివరాలు వెల్లడించారు.

408 మంది బైండోవర్, 90 రౌడీషీట్‌లు

ఎన్నికలకు విఘాతం కలిగించడం, నేరాలకు పాల్పడిన సంఘటనలు, గతంలో నేర చరిత్ర ఉన్న వారిపై ప్రత్యేక దృష్టి సారించాం. వారి నుంచి ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగరాదనే 408 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశాం. 90 మందిపై రౌడీషీట్‌లు తెరిచాం.

తుపాకులు స్వాధీనం..

ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందుగానే లైసెన్స్ కలిగిన 52 తుపాకులను స్వాధీనం చేసుకున్నాం. అనుమతి పొందిన వారికి కౌంటింగ్ పూర్తయిన తర్వాత అప్పగిస్తాం.

సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి..

ఆదోని నియోజకవర్గంలో 16 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాం. ఇందులో పెద్దతుంబళం, పెద్దహరివాణం, జాలిమంచి, హాన్వాల్, సంతెకూడ్లూరు, కపటి, చిన్నపెండేకల్, అలసందగుత్తి, 104బసాపురం, కల్లుబావి, చిన్నగుడి శక్తిగుడి ప్రాంతం, జీవేశ్వర పాఠశాల ప్రాంతం, ఆర్ట్స్ కళాశాల వద్ద ఉన్న ప్రాంతం, కౌడల్‌పేట, వైఎంకే ఉన్నత పాఠశాల పరిసరాలు, మేదర్‌గేరి, హవ్వన్నపేట ప్రాంతాలను గుర్తించాం. ఆయా ప్రాంతాల్లో ఈనెల 31వ తేదీ వరకు పట్టణ, గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు చేపడతాం.

అక్రమ రవాణాపై నిరంతరం నిఘా..

ఎన్నికల నేపథ్యంలో అక్రమ రవాణాపై సరిహద్దుల వద్ద నిరంతరం నిఘా ఏర్పాటు చేశాం. తనిఖీలు విస్తృతం చేశాం. ఇతర రాష్ట్రాల నుంచి లిక్కర్, డబ్బు, మాదక ద్రవ్యాలు, మారణాయుధాలు పట్టణంలోకి రాకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. నియోజకవర్గంలోకి ప్రవేశిస్తున్న ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే అనుమతిస్తున్నాం. ఎన్నికల నియమావళిని అతిక్రమించినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా చర్యలు తప్పవు.

వలంటీర్ల సేవలు మరువలేనివి

- వలంటీర్లపై టీడీపీ, జనసేన అనుచిత వాఖ్యలు తగవు
- మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి



మంత్రాలయం: ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరవేస్తున్న వలంటీర్ల సేవలు మరువలేనివని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి అన్నారు. సోమవారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వలంటీర్లను చూస్తే చంద్రబాబుతో పాటు తెలుగుదేశం నేతల గుండెల్లో వణుకు పుడుతోందన్నారు. చంద్రబాబునాయుడు, ఆయన దత్తపుత్రుడు పవన్, ఆ పార్టీ నేతలు వలంటీర్లను కించపరిచేలా మాట్లాడడం సరికాదన్నారు. అధికారంలోకి రావాలనే దురుద్దేశంతో వలంటీర్లపై అనుచిత వాఖ్యలే చేస్తే ప్రజలో తగిన గుణపాఠం చెబుతారన్నారు. వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆర్శనంగా నిలుస్తోందని తెలిపారు. కరోనా కష్ట కాలంలో సైతం ప్రాణాలను ఫనంగా పెట్టి ప్రజలకు సేవలందించారని తెలిపారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థ వచ్చాక ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే బాధలు తొలగిపోయాయని అన్నారు. ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత వలంటీర్లకే దక్కుతుందన్నారు. ఇది చూసి ఓర్వలేక టీడీపీ నేత చంద్రబాబు, పవన్ మేము అధికారంలోకి వచ్చాక వలంటీర్ల కథ తేలుస్తాం అంటూ బెదిరింపులకు పాల్పడడం దారుణమన్నారు. శ్రీకాళహస్తిలో టీడీపీ నేత బొజ్జల సుధీర్‌రెడ్డి వంటీర్లను ఉగ్రవాదులతో పోల్చడం వారి అజ్ఞానానికి నిదర్శనమన్నారు. జగనన్న ప్రభుత్వంలో ప్రతి పేదవాడు ఆనందం ఉన్నారన్నారు. కులం, మతం, పార్టీలు తేడా లేకుండా అన్నీ వర్గాల ప్రజలకు అర్హతే ప్రామాణికంగా వలంటీర్లు సేవలు అందించారని గుర్తు చేశారు. వలంటీర్లను విమర్శిస్తున్న టీడీపీ నాయకులు వారికి క్షమాపణలు చెప్పాలన్నారు.

ఘనంగా హోలీ సంబరాలు


రంగుల పూసుకొని చిన్నారుల కేరింతలు


హోలీ సంబరాల్లో యువకులు


స్త్రీ వేషధారణలో ఆలయానికి వచ్చిన పురుషులు


రంగులు చల్లుకుంటూ సందడి చేస్తున్న యువత

ఆదోని సెంట్రల్: హోలీ పండుగను కుల మతాలకు అతీతంగా సోమవారం పట్టణ ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నారుల నుంచి యువకులు, పెద్దలు వాడవాడలా ఉల్లాసంగా పాల్గొని రంగులు చల్లుకునిఒకరినొకరు శుభాకాంక్షలుతెలుపుకున్నారు.

వేడుకగా రథోత్సవం

ఆదోని రూరల్: మండలంలోని సంతెకూడ్లూరు గ్రామంలో రతీమన్మథుల రథోత్సవం సోమవారం వేడుకగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి కుంభాలు, కలశాలతో ప్రదర్శనగా వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు.. వారు వీరవుతారు..

కర్ణాటక రాష్ట్రానికి సరిహద్దు ప్రాంతంలో ఉన్న సంతెకూడ్లూరు గ్రామంలో పురాతన కాలం నుంచి వింత ఆచారం ఆనవాయితీగా వస్తుంది. తమ కోరికలు తీరిన వారిలో పురుషులు స్త్రీ వేషధారణలో వచ్చి స్వామి అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటారు. మంగళవారం ఉదయం రతీ మన్మథులను దహనం చేసి అనంతరం ప్రతి ఇంటి నుంచి కుంభాలు, కలశాలు, వేషధారణలతో ప్రదర్శనగా వచ్చి స్వామికి మొక్కులు తీర్చుకోనున్నారు.

హోలి సంబరాలు

కోసిగి: మండల కేంద్రంలో హోలిని ఘనంగా జరుపుకున్నారు. యువకులు, చిన్నారులు, పెద్దలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు. కోసిగిలోని నాడుగేని వీధి, సిద్ధప్పపాళెం, ఎన్టీఆర్ కాలనీ, వైఎస్సార్ సర్కిల్‌లో హోలి జరుపుకున్నారు. సోమవారం రాత్రి పాల్గుణ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని నాగన్న కట్ట సమీపంలోని కామప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కట్టెలు కాల్చి కామదహనం చేశారు.

నేటి నుంచి ఢణాపురంలో ధార్మిక కార్యక్రమాలు

ఆదోని అర్బన్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి మండలంలోని ఢణాపురం గ్రామ ఆంజనేయస్వామి దేవస్థానంలో ధార్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి సోమవారం తెలిపారు. మూడు రోజుల పాటు శ్రీ మద్రామాయణం, మహాభారతం, భగవద్గీతపై గీతా ప్రచారకులు మద్దయ్యస్వామి ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలితో ప్రతి రోజూ భజనలు ఉంటాయని చెప్పారు. శుక్రవారం గోపూజ, కుంకుమార్చన కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను స్థానిక భక్త సమాజంతో కలిసి ఆవిష్కరించారు. న్యాయకంటి భీమిరెడ్డి, మాజీ సర్పంచ్ శెట్టి వీరన్నగౌడ్, యం.మల్లికార్జున, కె.శివప్ప, భీమలింగన్నగౌడ్, వీరయ్య, కె.సిద్ధప్ప పాల్గొన్నారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి


బెంగి అయ్యన్న (ఫైల్)

కోసిగి: మండల కేంద్రం కోసిగి కొండగాని వీధిలో నివాసం ఉంటున్న బెంగి అయ్యన్న (70) వడదెబ్బతో సోమవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. సోమవారం ఉదయం అయ్యన్న కోసిగిలోని తన పొలానికి వెళ్లాడు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. పెద్ద దిక్కు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతినికి భార్య కొరవమ్మ, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రాజగోపుర నిర్మాణానికి రూ. 1.50 లక్షల విరాళం


ఆలయ అధికారులకు చెక్కు అందజేస్తున్న దాతలు

కౌతాళం: ఉరుకుంద గ్రామంలోని ఈరన్నస్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన గంట హనుమంతప్ప కుటుంబ సభ్యులు రూ.లక్ష, కర్నూలు నగరానికి చెందిన శ్రీనివాసులు శ్రీలత కుటుంబ సభ్యులు రూ. 50 వేలు విరాళం అందజేశారు. సోమవారం ఆలయ డిప్యూటీ కమిషనర్ హెచ్. వెంకటేశ్వర్లును కలిసి చెక్కును అందజేశారు. దాతలకు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ పర్యవేక్షకులు రామ్మోహన్‌రావు, మల్లికార్జున, వెంకటేశ్వర్లు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక రీచ్ తనిఖీ


నాగలదిన్నె ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

నందవరం: మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలోని ఇసుక రీచ్‌ను ఆదోని సబ్ కలెక్టర్ నారాయణ శర్మ, మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ సోమవారం తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో రీచ్‌లో ఇసుక రవాణా నిలిపివేసినట్లు తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వెంట తహసీల్దార్ ఓబులేసు, డిప్యూటీ సర్వేయర్ శ్రీనివాస రాజు, ఎస్ఐ తిమ్మయ్య ఉన్నారు.

అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల్లో ప్రత్యేక నిఘా

–సెబ్ డిప్యూటీ కమిషనర్ నాగ మద్దయ్య


క్షేత్రగుడి చెక్ పోస్టు వద్ద సిబ్బందికి సూచనలు చేస్తున్న నాగ మద్దయ్య

ఆలూరు రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక నిఘా ఉంచినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డిప్యూటీ కమిషనర్ (క్రైం,విజయవాడ) నాగ మద్దయ్య అన్నారు. సోమవారం హాలహర్వి మండలంలోని క్షేత్రగుడి, హొళగుంద మండలంలోని మార్లమడికి వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్ పోస్టులను ఆయన తనిఖీ చేశారు. కర్ణాటక నుంచి ఆంధ్రప్రదేశ్‌లోకి వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని ఆదేశించారు. కర్ణాటక మద్యం, నగదు, ఇతర నిషేధిత వస్తువులు అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. సారా, బెల్టుషాపులపై దాడులు విస్తృతం చేయాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో కర్ణాటక మద్యం నిల్వలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాత నేరస్తులపై నిఘా పెంచి వారిపై బైండోర్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతకు ముందు ఆలూరు సెబ్ పోలీసు స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట జిల్లా అసిస్టెంట్ సెబ్ సూపరింటెండెంట్ వినోద్ కుమార్, కర్నూలు సెబ్ డివిజనల్ టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నరసానాయుడు, ఆలూరు సెబ్ సీఐ సోమశేఖర్ ఉన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ ఓబులేసు

ఆలూరు రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఓబులేసు అన్నారు. ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు సోమవారం ఆలూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రౌడీషీటర్లు, బైండోవర్ కేసులు ఉన్న వ్యక్తులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో అల్లర్లకు పాల్పడడం, గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేయడం, సారా, మద్యం విక్రయించడం, సరఫరా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నీటి సమస్యను పరిష్కరించండి

ఆదోని రూరల్: మండలంలోని గ్రామాల్లో నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు, మండల కార్యదర్శి లింగన్న కోరారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో శుద్ధి చేయని నీటిని నేరుగా పంపింగ్ చేస్తున్నారన్నారు. దీనివల్ల ప్రజలు రోగాలబారిన పడుతున్నారని చెప్పారు.

ఆలయానికి 101 కేజీల గంట విరాళం


భక్తుడు అందజేసిన గంట

ఆస్పరి: మండలంలోని కైరుప్పల వీరభద్రస్వామి ఆలయానికి చిరుమాన్‌దొడ్డి గ్రామానికి చెందిన వీరయ్య స్వామి కుటుంబ సభ్యులు 101 కేజీల గంటను సోమవారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా కైరుప్పల గ్రామంలో గంటను మేళతాళాల మధ్య ఊరేగించి వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఆలయాభివృద్ధికి భక్తులు విరివిగా విరాళాలు ఇవ్వాలని నిర్వాహకులు కోరారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

తుగ్గలి: స్పెయిన్ దేశస్తుల సహకారంతో పగిడిరాయి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పేద విద్యార్థులకు రూ.5లక్షల విలువైన 68 సైకిళ్లను సోమవారం పంపిణీ చేసినట్లు ఆర్డీటీ సంస్థ రీజినల్ డైరెక్టర్ రామేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ స్థాపించిన ఆర్డీటీ సంస్థ నిరుపేదల కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తోందని చెప్పారు. చదువుకు పేదరికం అడ్డు రాకూడదనే ఉద్దేశంతో దాతలు సైకిళ్లు పంపిణీ చేశారన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. సైకిళ్లు అందించిన స్పెయిన్ బృందానికి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్డీటీ ఏటీఎల్ రెహనాబీ, సభ్యులు వెంకటేష్, రామాంజనేయులు పాల్గొన్నారు.